క్లుప్తంగా

దోమల నివారణ మందు స్ప్రే



పెదపెంకిలో దోమల మందు స్ప్రే చేయిస్తున్న సర్పంచ్ పాపారావు

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో సర్పంచ్ ఎన్.పాపారావు ఆధ్వర్యంలో దోమల నివారణ మందును శుక్రవారం స్ప్రే చేయించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వీధులు, కాలువలు, చెత్తాచెదారాలు ఉండే ప్రదేశాలలో దోమల మందు స్ప్రే చేయిస్తున్నట్లు సర్పంచ్ ఈ సందర్భంగా తెలిపారు. వర్షాకాలం అవడంతో ఖాళీ ప్రదేశాలలో తుప్పలు, డొంకలు ఎక్కువై దోమలు పెరుగుతున్నాయని వాటిని నియంత్రించకపోతే వైరల్ జ్వరాలు సోకే ప్రమాదముందన్నారు. ప్రజలు చెత్తాచెదారాలను పోగులుగా ఉంచవద్దని కోరారు. అలాగే మురుగు నీటి నిల్వలు లేకుండా చూడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన పైప్‌లైన్‌కు మరమ్మతులు



మంచినీటి పైప్‌లైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న సర్పంచ్ కె.రాధ, కార్యదర్శి శ్రీనివాసరావు

సీతానగరం: మండలంలోని చినభోగిలి ఇందిరా కాలనీ ప్రజలకు తాగునీరందిస్తున్న ప్రధాన పైప్‌లైన్ శిథిలమవడంతో మరమ్మతులు చేపడుతున్నామని సర్పంచ్ కురమాన రాధ అన్నారు. ఈ మేరకు శుక్రవారం చినభోగిలి ఇందిరా కాలనీలో పంప్ హౌస్ నుంచి నీరు సరఫరా చేస్తున్న ప్రధాన పైప్‌లైన్ శిథిలం కావడంతో కొత్తగా పైప్‌లైన్ వేయడానికి సర్పంచ్ రాధ, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఇంటింటి కుళాయి పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నారాయణపురంలో విద్యార్థులకు పుస్తకాలు, సామగ్రి పంపిణీ చేస్తున్న పద్మావతి

బలిజిపేట: ఎంపీపీఎస్ నారాయణపురం–2 పాఠశాల విద్యార్థులకు కీర్తిశేషులు జి.ఉమామహేశ్వరరావు మాస్టారు జ్ఞాపకార్థం నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ శుక్రవారం పంపిణీ చేశారు. మాస్టారి జయంతి సందర్భంగా భార్య పద్మావతి, కుమార్తె ప్రియాంకలు రూ.2,100 విలువ కలిగిన సామగ్రి విద్యార్థులకు అందజేశారు. వారిని ప్రధానోపాధ్యాయుడు రత్నాకరరావు, ఎం.శారదాదేవి, బి.మంజుష, గ్రామస్తులు అభినందించారు.

'నాడు - నేడు' పనుల పరిశీలన



శివరాపురం పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న పీఎంయూ అధికారి ప్రకాశరావు

సాలూరు: మండలంలోని శివరాంపురం, జీగిరాం పాఠశాలలతో పాటు చీపురువలస, ముచ్చర్లవలస, తీనుసామంతవలస అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న 'నాడు – నేడు' పనులను రిటైర్డ్ ఎస్‌ఈ, పీఎంయూ అధికారి కేజే ప్రకాశరావు శుక్రవారం పరిశీలించారు. ఫేజ్ –2లో భాగంగా జరుగుతున్న పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం పనులకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజశేఖర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ గౌస్, తదితరులు ఉన్నారు.

భక్తులతో ఆలయాలు కిటకిట



చిలకలపల్లి సంతోషిమాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బలిజిపేట: శ్రావణ మాసం మూడవ శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అందులో భాగంగా చిలకలపల్లి సంతోషిమాత ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు అమ్మవారికి ధూప.దీప నైవేద్యాలు సమర్పించారు. మహిళలు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

పండగలా వ్యవసాయం..



గత పాలకులు వ్యవసాయాన్ని దండగ అన్నారు. అటువంటి వ్యవసాయ రంగాన్ని లాభాసాటిగా మార్చిన ఘనత దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిది. ఆయన వారసుడిగా అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్‌రెడ్డి ఆది నుంచి కూడా రైతన్నకు అండగా నిలిచాడు. ఉన్న ఊరిలోనే రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందించేందుకు ఆర్‌బీకేలు ఏర్పాటు చేయడంతో పాటు సాగుకు సంబంధించిన అన్ని సలహాలు, సూచనలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. రైతన్నకు అండగా ఉంటున్న జగనన్న తాజాగా కౌలు రైతులకు కూడా ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు నడుంబిగించారు. ఈ క్రమంలోనే భూములు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న కౌలు రైతులకు సాగుకు సాయం పేరిట ఆర్థిక సాయం విడుదల చేయడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

రైతన్నకు అండగా..



కౌలు రైతులకు అండగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఉండడం మా అందరి అదృష్టం. వ్యవసాయం పెట్టుబడి కోసం నగదు అందించడం వల్ల అప్పుల భారం తప్పింది. జగనన్న వల్లే వ్యవసాయం పండగలా మారింది.

– జర్జాపు లక్ష్మణరావు, కౌలు రైతు, పారన్నవలస, సాలూరు మండలం

మా గుండెల్లో రాజన్న...



దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మా గుండెల్లో ఉంటారు. పాచిపెంట సమీపంలో పెద్దగెడ్డ జలాశయం ఏర్పాటు చేయడంతో నాకున్న ఐదెకరాల భూమికి సాగునీరు అందుతోంది. ప్రతి సంవత్సరం రెండు పంటలు సాగు చేస్తున్నాను. రాజన్న చేసిన మేలు మరువలేం.

– యచ్చం పార్వతీశం, రైతు, పాంచాలి గ్రామం

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు..



గత టీడీపీ ప్రభుత్వం కౌలు రైతులను పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కౌలురైతుల కష్టాలను గుర్తించి మాకు అండగా నిలిచారు. సాగు సాయం పేరిట ఆర్థిక సాయం అందించడం గొప్ప విషయం. ఆయనకు కౌలు రైతుల తరఫున ధన్యవాదాలు.

– గంట శంకరరావు, కౌలు రైతు, శివరాంపురం, సాలూరు మండలం

కౌలు రైతులను గుర్తించిన మహానుభావుడు



పదిహేనేళ్లుగా భూమి కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. గతంలో ఏ ప్రభుత్వమూ మమ్మల్ని గుర్తించలేదు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి కౌలు రైతులను గుర్తించగా, ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కౌలురైతులను గుర్తించి రైతుభరోసా అందిస్తున్నారు. ఆయన మేలు మరువలేం.

– మెరుగుబోయిన శ్రీనివాసరావు, కౌలురైతు, మక్కువ మండలం

పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణంలోని 25వ వార్డు ప్రజలను ఎన్నో ఏళ్లుగా పట్టి పీడిస్తున్న మంచినీటి సమస్యకు పరిష్కారం చూపేదిశగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, వార్డు ప్రజల సమక్షంలో ఎమ్మెల్యే జోగారావు పైప్‌లైన్ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. మున్సిపాలిటీలోని 25వ వార్డు పరిధిలో గల మద్దాల వారి వీధిలో తాగునీటి పైపులైన్ పాడైపోయిన కారణంగా స్థానిక ప్రజలు నిత్యం మంచి నీటికి ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఇటీవల ఎమ్మెల్యే అలజంగి జోగారావు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వార్డు ప్రజల సమస్యలను స్థానిక కౌన్సిలర్ ఎన్.సుధీర్ కుమార్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వెంటనే నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. అలాగే వార్డులోని పలు వీధులలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టేందుకు అధికారులకు ఆదేశాలు జారీచేసి గడపగడపకు మనప్రభుత్వం నిధుల ద్వారా పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు, స్థానిక కౌన్సిలర్ నిమ్మకాయల సుధీర్ కుమార్‌కు వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్‌చైర్మన్ యిండుపూరి గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్‌లీడర్ మంతిని రవికుమార్, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు ఎస్.లావణ్య, వై.త్రినాథ, మున్సిపల్ కమిషనర్ రామఅప్పలనాయుడు, ఏఈ ఆనందకుమార్, కాంట్రాక్టర్ డి.తిరుపతిరావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్. సుందరరావు, సాండి గోపి, గండి లక్ష్మి, పాకల సన్యాసిరావు, గొర్లి వెంకటరమణ, కార్యకర్తలు, వలంటీర్లు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని బలోపేతానికి కృషి చేయాలి

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు కృషిచేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన భీమవరపు కృష్ణ, కార్యవర్గ సభ్యులను శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. రానున్న రోజుల్లో పార్టీని అన్ని స్థానాల్లో గెలిపించి సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు.

గృహ సారథులకు ప్రత్యేక అహ్వానం

దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా నిర్వహించనున్న సేవా కార్యక్రమాలకు గృహ సారథులకు ప్రత్యేక అహ్వానం పలకాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కన్వీనర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు తన క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.

డ్రైడే పక్కాగా నిర్వహించాలి

● డీఐఓ బి.జగన్‌మోహన్‌రావు



డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: డ్రైడే కార్యక్రమాలు పక్కాగా నిర్వహించి దోమల వ్యాప్తిని నివారించే దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.జగన్‌మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు ఆయన పట్టణంలోని 16వ వార్డులో నిర్వహిస్తున్న డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి ఆవాసాల్లో వాడుకలో లేని, వర్షాల కారణంగా పాడైన వస్తువుల్లో చేరిన నీటి నిల్వలు గుర్తించి పారబోయాలని చెప్పారు. నీటి నిల్వల్లో వృద్ధి చెందుతున్న దోమల లార్వాలను గుర్తించి తొలగించాలన్నారు. వార్డుల్లో ప్రజలకు డ్రైడే కార్యక్రమం ఆవశ్యకతను వివరించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్ప, జయగౌడ్, ఏఎన్‌ఎం నారాయణమ్మ, ఆశ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ ఏర్పాటు

వీరఘట్టం: రేషన్ సరుకులను కార్డుదారులకు పారదర్శకంగా పంపిణీ చేసేందుకు మండల స్థాయి విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎస్‌డీటీ మల్లేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీకి చైర్మన్‌గా మండల తహసీల్దార్, వైస్ చైర్మన్‌గా మండల ఎంపీపీ, సభ్యులుగా జెడ్పీటీసీ, ముగ్గురు ఎంపీటీసీలు, రేషన్ డీలర్ల తరఫున ఒకరు, ఎండీఎం ఆపరేటర్లు తరఫున ఒకరు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు, దివ్యాంగులు ఒకరు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నుండి ఇద్దరు కమిటీ సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ నివేదికను కలెక్టర్‌కు నివేదించామని త్వరలో మండల విజిలెన్స్ కమిటీని ప్రకటిస్తామని తెలిపారు.

ఒకటో తేదీన పింఛన్‌దారుల ఆనందం



సీతానగరం: అప్పయ్యపేటలో వికలాంగుడికి పింఛన్ అందజేస్తున్న సచివాలయ కన్వీనర్ బి.సూర్యనారాయణ

సీతానగరం: ప్రతి నెల ఒకటో తేదీ వచ్చిందంటే పింఛన్‌దారుల ముఖాల్లో వెలిగిపోయే చిరునవ్వు పండగ వాతావరణాన్ని తలపిస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం సెప్టెంబర్ 1 ఉదయం 6 గంటలకే గ్రామ వలంటీర్లు డివైజ్‌లు, పింఛన్ డబ్బుతో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సచివాలయ కన్వీనర్లు సర్పంచ్‌లు ఎంపీటీసీల ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. గతంలో పింఛన్లు ఎప్పుడు వస్తాయో, ఎక్కడిస్తారో ఎవరిస్తారో తెలియక ఎదురుచూడాల్సి వచ్చేదని ఇప్పుడా పరిస్థితి లేదని లబ్ధిదారులు అంటున్నారు. మండలానికి కొత్తగా 600 పింఛన్లు మంజూరు అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వం సంకల్పంతో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్నసురక్ష గ్రామసభల్లో 600 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేసినట్లు ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్ తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన వారందరికీ పింఛన్లు, సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిం దన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా త్వరలో పంపిణీ చేస్తామని చెప్పారు.



గెడ్డలుప్పిలో వితంతువులు, వృద్ధులకు పంపిణీ చేస్తున్న సర్పంచ్ తిరుపతిరావు, ఉపసర్పంచ్ కిరణ్



వెంకటాపురంలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న మాజీ సర్పంచ్ గౌరునాయుడు



వృద్ధుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ కన్వీనర్ బి. ముకుందరావు

పక్కాగా ఆరోగ్య పరీక్షలు

పాలకొండ రూరల్/వీరఘట్టం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు పక్కాగా జరపాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు సూచించారు. వండువలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. రికార్డులను పరిశీలించి అనారోగ్య సమస్యలకు ఏ పరీక్షలు నిర్వహించి, ఏ విధమైన చికిత్స అందిస్తున్నారన్నది గుర్తించారు. నిర్ధారించిన పరీక్షల నివేదికలు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. తనిఖీలకు వచ్చిన గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. వైద్య సిబ్బంది అందజేస్తున్న ఐరన్, కాల్షియం మాత్రలు సూచించిన క్రమంలో వేసుకోవాలన్నారు. అనంతరం పాలకొండ పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది నిర్వహిస్తున్న డ్రైడే కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జగన్నాథరావు పరిశీలించారు. వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వేలో పాల్గొని ప్రజలతో మమేకమై దోమలు పెరగకుండా ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో వివరించారు. ఫ్రైడే – డ్రైడే కార్యక్రమ ఉద్దేశం వివరించారు. కార్యక్రమంలో బిటివాడ వైద్యాధికారి నితీషా, ఎస్‌ఓ ఇందిరాదేవి, డెమో యోగేశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు అన్నారు. మండలంలోని కన్నయ్యగూడ గ్రామంలో ఏక్షన్ ఇన్ రూరల్ టెక్నాలజీ అండ్ సర్వీసెస్ (ఆర్ట్స్) ఆధ్వర్యంలో గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అందాలన్న లక్ష్యంతో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ గిరిజనులతో మాట్లాడుతూ ప్రజల కోసం ప్రభుత్వం వైఎస్సార్ పెన్షన్ కానుక, ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా, బీమా, రైతు భరోసా వంటి అనేక పథకాలను అమలు చేస్తోందని, ఆయా పథకాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకునేలా స్వచ్ఛంద సంస్థలు తగిన ప్రోత్సాహాన్ని అందివ్వాలని సూచించారు. అనంతరం సవర జాతి సంస్కృతి స్పెషల్ పేరుతో ప్రచురించిన వాల్‌పోస్టర్లను, కర పత్రికలను సర్పంచ్‌లు కె.వాసుదేవరావు, రాజారావు, సవర భాష అధ్యక్షుడు గోపాల్ తదితరులతో కలిసి విడుదల చేశారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత

గరుగుబిల్లి: ప్రకృతిని పరిరక్షించుకోవాలని డీపీఎం షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని తోటపల్లిలో ప్రకృతి ఆదిదేవోభవ ప్రాంగణంలో గరుగుబిల్లి, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ మండలాలకు చెందిన యూనిట్ ఇన్‌చార్జ్‌లకు రెండు రోజుల శిక్షణ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారానే ప్రకృతిని కాపాడుకునేందుకు అవకాశం వుంటుందన్నారు.

చంద్రబాబు పాలనలో అభివృద్ధి శూన్యం



సాక్షితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో దాచుకోవడం.. దోచుకోవడం తప్ప అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో 'సాక్షి'తో మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్, ఎల్‌ఎన్‌టీ కంపెనీల నుంచి మనోజ్ పార్థసారథి పేరిట చంద్రబాబు పీఏ శ్రీనివాస్ ద్వారా రూ.118కోట్ల ముడుపులు చంద్రబాబు నాయుడికి అందాయని ఐటీ అధికారులు నిర్ధారించారన్నారు. ఈ రూ.118 కోట్ల ముడుపులు అందుకున్న చంద్రబాబుకు ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారులు నోటీసులు అందించారని, దీనిపై ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పి ఆయన శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో స్కిల్ డెవలెప్‌మెంట్ సెంటర్‌లో కొన్ని కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడినప్పుడు ఇదే శ్రీనివాసరావు ద్వారా ముడుపులు చెల్లించారని అసెంబ్లీ సాక్షిగా ఐటీ మంత్రి స్పష్టం చేశారన్నారు. గతంలో వేసిన ఎంక్వైరీలకు స్టేలు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఐటీ అధికారులు ఆధారాలతో ఇచ్చిన ఈ నోటీసులకు చంద్రబాబు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

సీపీఎం బైక్ ర్యాలీ



బలిజిపేటలో బైక్ ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

బలిజిపేట: పెంచిన ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బలిజిపేట మండల కేంద్రంలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు మండలంలోని నారాయణపురం, పెద్దింపేట, వెంగాపురం, తుమరాడ, పలగర, మిర్తివలస, బర్లి, అంపావల్లి గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి. ర్యాలీలో సీపీఎం సీనియర్ నాయకుడు జి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై భారం మోపారని, యువలకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పినా నేటికీ పత్తాలేదని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మన్మథరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందిస్తున్న ఎంఈఓ సామల సింహాచలం

బలిజిపేట: ఇటీవల జిల్లా కేంద్రంలో ప్రత్యేక అవసరాల విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి ఎంఈఓ సామల సింహాచలం బలిజిపేటలో ఎంఆర్‌సీ వద్ద మెడల్స్, సర్టిఫికెట్లు శుక్రవారం పంపిణీ చేశారు. బహుమతులు సాధించి న వారిలో బలిజిపేట ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్.మనోజ్, భోగి సౌమ్య (బంగారు), వంతరాం ఉన్నత పాఠశాల విద్యార్థి యు.కార్తీక్ (రజత), పెదపెంకి ఉన్నత పాఠశాల విద్యార్థి జి.గణేష్, చిలకలపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.శివలు (కాంస్య) ఉన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ సామల మాట్లాడుతూ జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచి మండలానికి, పాఠశాలలకు మంచి పేరు సాధించిపెట్టడంతో గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో రాష్ట్రస్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఐఈఆర్టీఎస్ రమణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి ఈశ్వరరావు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం మండల కన్వీనర్ రెడ్డి ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధాలనాలకు నిరసనగా పలు గ్రామాల సచివాలయాల ఎదుట సీపీఎం, సీఐటీయూ మండల నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఈ మేరకు నిడగల్లులో వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ కోతలు అరికట్టడం, అధ్వానంగా ఉన్న రోడ్లుకు మరమ్మతులు చేపట్టడానికి సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను సచివాలయ్యాల్లో అందజేశారు.

డిప్యూటీ సీఎంను కలిసిన మత్స్యకార సంఘ నాయకులు



ఉపముఖ్యమంత్రి రాజన్నదొరతో మత్స్యకార సంఘ సభ్యులు

సాలూరు: ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలిచిన వెంగళ రాయసాగర్ మత్స్యకార సంఘ సభ్యులు ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొరను మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో శుక్రవారం కలిసి మత్స్యకారుల అభ్యున్నతిపై చర్చించారు. ఈ సందర్భంగా రాజన్న స్పందిస్తూ ఎటువంటి సమస్యలు న్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.